క్లుప్తంగా

మహిళా విభాగం అధ్యక్షురాలుగా భూమా కమలమ్మ



వజ్రకరూరు: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలుగా భూమా కమలమ్మ (వెంకటాంపల్లి) నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్షురాలుగా భూమా కమలమ్మ, ఉపాధ్యక్షురాలుగా సుశీలమ్మ, హారిక, ప్రధాన కార్యదర్శులుగా హరిత, రామాంజనమ్మ, మల్లేశ్వరి, లలితమ్మ, కార్యదర్శులుగా జ్యోతిబాయి, సుంకులమ్మ, జెస్సీ మేరి, కార్యవర్గ సభ్యులుగా ఈశ్వరమ్మ, బోయ లక్ష్మిదేవి, కవితబాయి, బస్త అనసూయమ్మ, ఎర్రమ్మ, వరలక్ష్మి, సునిత తదితరులను ఎంపిక చేశారు. మహిళా విభాగం సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్‌పీఆర్ గుప్తా

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో కళ్యాణదుర్గానికి చెందిన ఎన్‌పీఆర్ గుప్తాను నియమిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది. తనపై ఎంతో నమ్మకంతో రెండోసారి రాష్ట్ర వాణిజ్య విభాగంలో జనరల్ సెక్రటరీగా ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిలకు ఎన్‌పీఆర్ గుప్తా కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన మేరకు.. బ్రహ్మసముద్రం మండలం ఎరిడికెర గ్రామానికి చెందిన శ్రీకాంత్ సొంత పని నిమిత్తం రాయదుర్గానికి ఆటోలో వెళ్తుండగా, మార్గంమధ్యలో గోనబావి వద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

మేల్కోకపోతే ముప్పు

- మండుతున్న ఎండలు.. అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ముందస్తు కార్యాచరణపై చిత్తశుద్ధిలేని సర్కారు
- పంచాయతీలకే తాగునీటి పథకాల పర్యవేక్షణ
- ప్రతిపాదనలకే పరిమితం.. పైసా విదిల్చని ప్రభుత్వం



ఇటీవల కణేకల్లు రోడ్డు చివర్లో నీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు



శ్రీరామరెడ్డి తాగునీటి పైప్ లైన్ లీకేజీ

రాయదుర్గం: మార్చి ఆరంభంలోనే ఎండలు మండుతున్నాయి. భూగర్భజలాలు రోజురోజుకూ ఇంకిపోతున్నాయి. ప్రజలకు నీటి కష్టాలు షురూ కానున్నాయి. దాహం తీరుస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం పైపులైన్ లీకేజీల సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. దీనికితోడు గ్రామాల్లో ఎక్కడా ప్రత్యామ్నాయంగా చేతిపంపులు మరమ్మతు చేయించలేదు. కళ్యాణదుర్గం సమీపాన ఫేజ్–1 ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుకు గురైంది. పంచాయతీ బోర్లు ఎన్ని ఉన్నా శ్రీరామిరెడ్డి తాగునీరందకపోతే ఊర్లకు ఊర్లు నీటి కోసం తంటాలు పడాల్సి వస్తోంది. కూటమి సర్కారు ముందస్తు కార్యాచరణ చేపట్టలేదు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినా, ప్రభుత్వం పైసా కూడా విదిల్చడంలేదు. అరకొర నిధులతోనే పంచాయతీలకు తాగునీటి పథకాల పర్యవేక్షణ ఇచ్చి చేతులు దులుపుకుంది.

పీఏబీఆర్ డ్యాం నుంచి ఉమ్మడి జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, పెనుగొండ, హిందూపురం నియోజకవర్గాల్లోని 702 గ్రామాలకు తాగునీరు అందించే శ్రీరామరెడ్డి పథకం పైపులైన్ లీకేజీ సమస్య వేధిస్తోంది. జిల్లాలోని 31 మండలాల్లో పీడబ్ల్యూఎస్ స్కీమ్‌లు 1919, సీపీడబ్ల్యూఎస్ 33, చేతి బోర్లు 5,965 ఉన్నాయి. ఉందులో 127 గ్రామాల్లో తాగునీటి సమస్య జటిలం కానున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గం చూపలేదు. గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరందించాల్సి వస్తోందని అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

తాగునీటి గండం పొంచి ఉంది..

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 305 గ్రామాలకు శ్రీరామరెడ్డి తాగునీరే దిక్కు. ఈ నీరు వారం లేదా రెండు వారాలకు ఓ సారి వస్తున్నాయి. తాజాగా కళ్యాణదుర్గం సమీపాన ఫేజ్–1 ప్రధాన పైప్‌లైన్ మరమ్మతుకు గురైంది. దీంతో నాలుగు రోజులుగా నీటి సరఫరా ఆగింది. పంచాయతీ బోర్లు ఎన్నిఉన్నా శ్రీరామరెడ్డి తాగునీరందకపోతే ఊర్లకు ఊర్లు నీటి కోసం తంటాలు పడాల్సి వస్తోంది. మరమ్మతులకు గురైన చేతిబోర్లు మరమ్మతులు చేయిస్తున్నా, నీరు రాని పరిస్థితి. మార్చిలోనే ఎండలు మండిపోతుంటే మే లో నిప్పుల కొలిమిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం మునిపాల్టీల్లోనూ తాగునీటి సమస్యలు తీర్చేందుకు అరకొరగా నిధులు కేటాయించారు. దీంతో సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది.

లీకేజీలతో ఇబ్బంది

పల్లే, పట్టణాల్లో చాలా చోట్ల తాగునీటి పథకాలకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్లు లీకేజీలు కనిపిస్తున్నాయి. దీంతో పబ్లిక్ కుళాయిలు, నీటి ట్యాంకులకు అరకొరగా నీరు చేరుతున్నాయి. దీంతో దాహం కష్టాలు తీరడం లేదు. శ్రీరామరెడ్డి పథకం లైన్ ఊరూర లీకేజీలు ఏర్పాడ్డాయి. చాలా చోట్ల బోర్లను శుభ్రం చేయాల్సి ఉంది. మేల్కొంటేనే ఈ సమస్యలకు పరిష్కారం చూపవచ్చు. లేకుండా బిందెడు నీటికి బండెడు కష్టాలు పడాల్సి వస్తోంది.

ప్రత్యేక ప్రణాళికలు

నీటి కష్టాలు ఎదుర్కొనేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ప్రత్యేక ప్రణాళికలు చేపట్టింది. జిల్లాలో 127 గ్రామాల్లో అతి తీవ్రతను గుర్తించాం. అవసరమైతే ట్యాంకర్ల నీరందించాల్సి వస్తోంది. చిన్న మరమ్మతుల, అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిధులు మంజూరు కోసం ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపిచాం. ప్రస్తుతం జిల్లాలో నీటి కొరత అక్కడక్కడ మాత్రమే కనిపిస్తోంది. ఇబ్బందుల్లేకుండా చూస్తాం. శ్రీరామిరెడ్డి తాగునీరు సక్రమంగా వినియోగించేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– మురళీధర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, అనంతపురం

రాజీ మార్గమే రాజమార్గం

- జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి

కళ్యాణదుర్గం: కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి అన్నారు. శనివారం కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అనంతరం వివిధ కేసులలో 469 కేసులను రాజీ చేశారు. రూరల్ సీఐ వంశీకృష్ణ, బార్ కౌన్సిల్ సభ్యులు కరణం తిప్పేస్వామి, దాదాఖలందర్, ఎర్రిస్వామి, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

'లోక్ అదాలత్'లో 226 కేసుల పరిష్కారం

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

రాయదుర్గంటౌన్: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 226 కేసులు పరిష్కారమైనట్లు హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి, ఇన్‌చార్జ్ మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ ఎం.శ్రీధర్ తెలిపారు. జడ్జి మాట్లాడుతూ రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్‌తోపాటు ఇతర కేసులకు శాశ్వతంగా పరిష్కారం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పందిరి ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని పాతచెరువులోని రైతు రమేష్‌కు చెందిన బీరుతోట పందిరిని శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధితుడు రమేష్ మాట్లాడుతూ 3 ఎకరాల్లో సాగు చేసిన బీర పంట పందిరిని ఉద్దేశ పూర్వకంగా ధ్వంసం చేశారని వాపోయాడు. పంట చేతికొచ్చే సమయంలో నేలపాలు చేశారన్నారు. సుమారగా రూ. 3 లక్షలు నష్టం వచ్చిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కబ్జాలను అరికట్టడంలో విఫలం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని హౌసింగ్ లేఅవుట్లలో కబ్జాలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున పేర్కొన్నారు.శనివారం మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో కబ్జాలు చేసి మార్కింగ్ చేసిన స్థలాల వద్ద నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు కొట్రేష్, గౌస్‌పీరా, తిప్పేస్వామి, నరసింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్టోర్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు వద్ద చౌక బియ్యాన్ని అనంతపురం విజిలెన్స్ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. విజిలెన్సు సీఐ తెలిపిన మేరకు వెంకటేశులు అనే వ్యక్తి నుంచి 55 బస్తాల్లో 27.6 కింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.

బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడాలి

రాయదుర్గంటౌన్: ఉద్యమ సంస్థలు, సామాజిక వేత్తలు ఏకతాటిపై వచ్చి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఇండియన్ యాక్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ రాయలసీమ చైర్మన్ వెంకటరమణబాబు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక దాసప్ప రోడ్డులోని సామాజిక భవనంలో అఖిలభారత బహుజనల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామాజిక వేత్తల రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. అఖిల భారత బహుజనుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మనవల ఆంజనేయులు, మన హక్కులకై పోరాడు ఉద్యమ సంస్థ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు, ఇండియన్ యాక్స్ అవేర్‌నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ మెంబర్ దేవరపల్లి గోపాల్, షేక్ అబ్దుల్లా, అఖిల భారత బహుజన సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

కళ్యాణదుర్గం (కంబదూరు): కంబదూరులోని స్థానిక స్వాతంత్ర్య సమరయోధులు దివంగత ఐ. ఓబయ్య వ్యవసాయ క్షేత్రంలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కన్వీనర్లు హనుమంతరాయుడు, వడ్డే వెంకటప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్ హాజరవుతారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మండలాల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, విభాగాల జిల్లా కమిటీ, నియోజకవర్గ కమిటీల అధ్యక్షులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

శతాధిక వృద్ధుడి మృతి



చిక్కన్న(ఫైల్)

కంబదూరు: జెక్కిరెడ్డిపల్లికి చెందిన శతాధిక వృద్ధుడు పెద్ద నాగప్ప గారి చిక్కన్న(101) మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా మనవళ్లు, మనరాళ్లు 15 మంది ఉన్నారు. చిక్కన్న మృతి పట్ల వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు సంతాపం ప్రకటించారు.

రైతు సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు



ముద్దలాపురంలో రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్, తదితరులు

కూడేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద, రైతు సంఘం రాష్ట్ర నేత రాంభూపాల్ ధ్వజమెత్తారు. రైతు సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం ముద్దలాపురం చేరుకుంది. పాదయాత్రకు డాక్టర్ గేయానంద్, రాంభూపాల్ సంఘీభావం తెలిపారు. ముద్దలాపురంలో బ్యాడిగి మిర్చి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తెగుళ్లతో పంట దిగుబడి బాగా తగ్గిపోయిందని, మార్కెట్లో గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్ట పోయామని రైతులు వాపోయారు. అనంతరం డాక్టర్ గేయానంద్, రాంభూపాల్ మాట్లాడారు. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక అప్పులతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, 2024–25 ఖరీఫ్, రబీ సీజన్లలో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారాంరెడ్డి, సహాయ కార్యదర్శి నాగేంద్ర కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్టమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెబుదాం



రాయదుర్గంలో సాకే చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న యువజన విభాగం శ్రేణులు



కళ్యాణదుర్గం సమావేశంలో మట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్

రాయదుర్గంటౌన్: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ తీరుపై ఈ నెల 12న జిల్లా కేంద్రంలో చేపట్టిన ఫీజు పోరుకు తరలివచ్చి జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని మెట్టు గోవిందరెడ్డి క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన రాయదుర్గం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కేడర్‌తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాయదుర్గం యువజన విభాగం అధ్యక్షుడు చిత్ర రవీంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాకే చంద్రశేఖర్ మాట్లాడారు. వైఎస్ జగన్ పార్టీలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం కల్పించారన్నారు. పదవులను బాధ్యతగా నిర్వహిస్తూ వచ్చే నాలుగేళ్లలో శ్రమించి పార్టీని బలోపేతం చేయడంతోపాటు గ్రామస్థాయిలో కూటమి మోసాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు పాలనపై తొమ్మిది నెలలోన్లే ప్రజల్లో విరక్తి కలిగిందన్నారు. సూపర్ సిక్స్ అంటూ అబద్ధాలు చెప్పి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాయదుర్గం పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామాంజనేయులు, రాయదుర్గం, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల యూత్ అధ్యక్షులు తిమ్మప్ప, వన్నూరుస్వామి, తేజ, హనుమంతరెడ్డి, కేపీదొడ్డి సర్పంచ్ రమేష్, శివారెడ్డి, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రశాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేద్దాం

కళ్యాణదుర్గం రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 12న నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ జగన్ హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. పేదలు ఉన్నత చదువులు అభ్యసించేందుకు భరోసా ఉండేదన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందన్నారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నేత, కళ్యాణదుర్గం వలంటీర్ల విభాగం అధ్యక్షుడు షెక్షావలి, కళ్యాణదుర్గం నియోజవర్గం యువజన విభాగం అధ్యక్షుడు తలారి చరణ్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడు మురళి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మారుతి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు పాతలింగ, నాయకులు మల్లాపురం మల్లి, మహేష్, చిరు, తేజ, వంశీ, మంజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు

బెళుగుప్ప: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సర్కిల్ విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురురాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెళుగుప్ప, బ్రాహ్మణపల్లి, గంగవరం , హనిమరెడ్డిపల్లి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు ఉంటాయన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం, కంబదూరు, బెళుగుప్ప మండలాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ గురురాజ్ శనివారం తెలిపారు.

న్యాయం జరగకపోతే ఉద్యమం

రాయదుర్గంటౌన్: పశువైద్య విద్యార్థులకు న్యాయం జరగకపోతే ఉద్యమం చేపట్టనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పశువైద్య విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు.

స్వయంశక్తితో హక్కులు సాధించుకోవాలి



రాయదుర్గంలో మహిళా సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్



మహిళా దినోత్సవ ర్యాలీలో చైర్‌పర్సన్ శిల్ప, కౌన్సిలర్లు, అధికారులు



కళ్యాణదుర్గంలో ర్యాలీ చేస్తున్న డీఎస్పీ రవిబాబు, మహిళలు

రాయదుర్గంటౌన్: చట్టాలపై అవగాహన కలిగి ఉండి మహిళలు స్వయంశక్తితో హక్కులను సాధించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు హాజరైన సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ (హిందూపురం) మహిళా సదస్సులో మాట్లాడారు. మహిళా హక్కులు, చట్టాలపై వారి అవగాహన కల్పించారు. బాలికలు విద్యావంతులైతే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లోకానంద, రవి చంద్ర, రేణుక, అర్బన్ సీఐ జయానాయక్ పాల్గొన్నారు.

నారీ వివక్ష లేని సమాజంతోనే అభ్యున్నతి

రాయదుర్గంటౌన్: నారీ వివక్షత లేని సమాజంలోనే అభ్యున్నతి సాధ్యమని, మహిళలకు విద్య, ఉపాధి, భద్రత, ఆరోగ్యం తదతర అంశాలలో సమాన అవకాశాలు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పిలుపునిచ్చారు. శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, అర్బన్ సీఐ జయానాయక్, వార్డు కౌన్సిలర్లు శారదాదేవి, శ్రీలక్ష్మి, నసీమా, ప్రశాంతి, జ్యోతి, పొరాళ్ల గోవిందరాజులు, సంజీవప్ప, చన్నవీరస్వామి, మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ పొరాళ్ల శివకుమార్ పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మెన్, మహిళా విభాగం నియోజకవర్గ నాయకురాలు బోయ సుశీలమ్మ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం నాయకురాలు గురికాల ఓబుళమ్మ, పచ్చి అరుణ, కమలమ్మ, కొకుంట్ల వసంతమ్మ, నీలూరి రత్న, కురుబ లక్ష్మిదేవి, రేణుకమ్మ, బాల్యారాణి, వి.లక్ష్మి, నిర్మల, వన్నూరమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచు మీనుగ లలితమ్మ, ఈఓ గౌస్ సాహెబ్, పాలకవర్గ సభ్యులు పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

వజ్రకరూరు: స్థానిక గ్రామ సచివాలయం, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో సర్పంచు మోనాలిసా, హెచ్ఎం రంగప్రసాద్, గ్రామ కార్యదర్శి మల్లయ్య, ఏఎస్ఎం సుకన్య శనివారం పాల్గొన్నారు.

కూడేరు: కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం జరుపుకున్నారు. వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ యశోద, ఎంహెల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప, బెళుగుప్ప తండా గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నిర్వహించారు. బెళుగుప్ప తండాలో ఆర్‌డీటీ రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు మహిళా సభ్యులు లక్ష్మీబాయి, సోనియా బాయి, సీడీసీ సభ్యులతో కలసి నిర్వహించారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో మండల సస్యమిత్ర సమైఖ్య, రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. డీఎస్పీ రవిబాబు మాట్లాడారు. ముందుగా మహిళలు పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యకక్రమంలో రూరల్ సీఐలు,వంశీ కృష్ణ, నీలకంటేశ్వర్, ఆర్‌డీటీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉరవకొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న మహిళా విభాగం నాయకురాలు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కుమారి, శారదా, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, ఈశ్వరమ్మ, మహిళలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

కంబదూరు: కంబదూరు మండల కేంద్రంలో రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం శనివారం జరుపుకున్నారు. మెడికల్ ఆఫీసర్ ఆసియా, ఏఎస్ఐ ఓబుళపతి, రిడ్స్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ నూర్ మహ్మద్, ఓఆర్‌డబ్ల్యూ యశోదమ్మ, వరలక్ష్మి, భాగ్యమ్మ, వసంత బాయి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే మహిళలకు ఉజ్వల భవిష్యత్తు

కణేకల్లు: చదువుతోనే మహిళలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్డీటీ ఏటీఎల్ వెంకటేశులు పేర్కొన్నారు. శనివారం 43 ఉడేగోళంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఆర్డీటీ స్కూల్ నుంచి గ్రామ పుర వీధుల్లో మహిళలు, చిన్నారుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎస్‌టీఎల్ వసంత, సీఓ హనుమంతరాయుడు, సీబీటీ సురేష్ రెడ్డి, రాము పాల్గొన్నారు.



సీతారామస్వామి ఆలయంలో విశేష పూజలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని స్థానిక బలిజవీధిలో ఉన్న సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అర్చనలు,విశేష పూజలు, మంగళహారతి,తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు.

నేడు గవిమఠం బ్రహ్మరథోత్సవం

- నేటి రథోత్సవానికి భారీ ఏర్పాట్లు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు


గవిమఠం రథం

ఉరవకొండ: తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకలో దాదాపు 770 ఉపమఠాలు కలిగి తలమానికంగా నిలిచిన గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా జరగనుంది. ఈనెల 4 నుంచి గవిమఠంలో చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. రథోత్సవానికి ఇప్పటికే గవిమఠం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులకు సౌకర్యాలు కల్పించారు. రథోత్సవంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్పెషల్ పార్టీ పోలీసులతో భద్రత కల్పించనున్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రథోత్సవానికి ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాదిగా భక్తులు తరలిరానున్నారు.


బసవేశ్వర వాహనోత్సవంలో పాల్గొన్న గవిమఠం ఉత్తరాధికారి, సహాయ కమిషనర్ తదితరులు

బసవేశ్వర వాహనంపై చంద్రమౌళీశ్వరుడు ..

గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చంద్రమౌళీశ్వరస్వామి బసవేశ్వర వాహనంపై భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి మహారుద్రాభిషేకం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకీ మఠం పీఠాధిపతులు కల్యాణస్వామిజీ, మఠం సహాయ కమిషనర్ కె.రాణి ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వర స్వామి మూలవిరాట్‌ను ఊరేగింపుగా ప్రత్యేక వాహనం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం బసవేశ్వర వాహనంపై స్వామి ఉత్సవమూర్తిని ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో మఠం ఏజెంట్ రాజన్నగౌడ్, మఠం జూనియర్ అసిస్టెంట్లు గోపి, నారాయణస్వామి పాల్గొన్నారు.


భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


అందంగా ముస్తాబైన చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ ముఖద్వారం

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి


పొర్లు దండాలు పెడుతున్న భక్తులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్‌లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం వేలాది మంది భక్తుల మధ్య వైభవంగా శనివారం జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామిని ఊరేగింపుగా ఉద్దేహాళ్ సమీపంలోని వేదావతి హగరికి తీసుకొచ్చి, ప్రత్యేక జలంలో అభిషేకం చేశారు. వేదావతి హగరిలో సాయంత్రం వరకు వివిధ గ్రామాల నుంచి వచ్చి వేలాది మంది భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు నీటిలో మునిగి పొర్లు దండాలు పెట్టారు. అనంతరం సాయంత్రం ఉప్పరహాళ్‌లో లక్ష్మీనరసింహ స్వామిని ఊరేగించారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కమనీయం.. శివపార్వతుల రథోత్సవం


రథం లాగుతున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు


రాయదుర్గం: మండలంలోని 74 ఉడేగోళం సమీపాన ప్రసిద్ధి చెందిన మద్దానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో బాగంగా శనివారం రాత్రి శివ, పార్వతుల ముత్యాల రథోత్సం కమనీయంగా సాగింది. ఉత్సవ విగ్రహాలను భక్తుల కోలాహలం మధ్య ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. రథోత్సవంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. మండల కన్వీనర్ రామాంజినేయులు, నాయకులు ఎర్రగుంట కేశవరెడ్డి, పొరాళ్ల శివ, కోఆప్షన్ శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి షటిల్ టోర్నీ ప్రారంభం


షటిల్ టోర్నీని ప్రారంభిస్తున్న గవిమఠం పీఠాధిపతులు

ఉరవకొండ: గవిమఠం బ్రహ్మోత్సవాల్లో ను పురస్కరించుకొని ఉరవకొండ ఎస్‌కేఆర్‌సీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఆవరణలో జిల్లా స్థాయి షటిల్ టోర్నీని గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. టోర్నీలో మొత్తం 25 జట్లు పోటీపడుతున్నట్లు క్లబ్ కార్యదర్శి రవీంద్ర, ఉపాధ్యక్షులు ఎర్రిస్వామినాయుడు, సహాయకార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు.

అంజన్నకు అభిషేకం


అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ స్వామి,సంతోష్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు చేశారు.

జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

వజ్రకరూరు: వజ్రకరూరులోని జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేశారు.